

ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బందులు

- ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి

మిర్యాలగూడ, మే 6: ఐదు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో తన నివాసంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అడుగడుగునా ఎండగట్టాలన్నారు. సమావేశంలో వార్డు కోఆర్డినేటర్ పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ, నాయకులు పల్నాటి జానకిరెడ్డి, రెడబోతు సంతోష్‌రెడ్డి, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ఘంట శ్రవణ్‌రెడ్డి, రవినాయక్, జన్నపాల కిరణ్, కత్రోజు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## సొంత గూటికి చేరిన 37వ వార్డు కౌన్సిలర్

మిర్యాలగూడ, మే 6: ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 37వ వార్డు కౌన్సిలర్ బల్లెం దేవకమ్మాఅయోధ్య సోమవారం తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు దేవకమ్మా అయోధ్యకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, పార్టీ నియోజకవర్గ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కౌన్సిలర్ దేవకమ్మాఅయోధ్య

## వానకాలం సాగుకు ఏర్పాట్లు పూర్తి

- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- డీఏఓ శ్రవణ్ కుమార్

నల్లగొండ, మే 6: రాబోయే వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వానకాలం సీజన్‌లో 11.50 లక్షల ఎకరాల్లో ఆయా పంటల సాగు కానున్నట్లు పేర్కొన్నారు. అందులో ఎక్కువగా 5.50 లక్షల ఎకరాల్లో పత్తి, 5.15 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందన్నారు. వరిలో 2.80 లక్షలు దొడ్డువి, 2.20లక్షల ఎకరాల్లో సన్నవి సాగు కానున్నాయన్నారు. ఇందుకు కావాల్సిన విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. పత్తి విత్తనాలు ఒకటి రెండు వర్షాలతో విత్తవద్దని, పూర్తి స్థాయిలో వర్షాలు పడ్డాకే విత్తాలని సూచించారు. పత్తి విత్తనాలు నాణ్యమైనవి, గుర్తింపు ఉన్న కంపెనీ విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. వరి, పత్తి విత్తనాల్లో ఆయా కంపెనీల విత్తనాలు తీసుకోని పరీక్షల కోసం పంపించామని వాటిల్లో నాణ్యత లేకపోతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పచ్చిరొట్ట ఎరువులు సైతం లక్ష ఎకరాల్లో సాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో 49వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఏడు వేల మెట్రిక్ టన్నుల యూరియా కూడా అందుబాటులో ఉన్నదని స్పష్టం చేశారు. విత్తనాల విషయంలో ఏమైనా సమస్యలు వస్తే 7288894509 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.




మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

## శాసనాలే చరిత్రకు ఆధారాలు : పరిశోధకుడు స్వామి

నకిరేకల్, మే 6 : శాసనాలు, పురావస్తు ఆధారాలే చరిత్రను నిర్మిస్తాయని గ్రామనామాల పరిశోధకుడు డాక్టర్ మండల స్వామి అన్నారు. నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామంలో ఉన్న రుద్రమదేవి మరణ శాసనాన్ని సోమవారం ఆయన సందర్శించారు. రుద్రమదేవి శాసనాన్ని వెలుగులోకి తీసుకురావడానికి కృషిచేసిన గ్రామానికి చెందిన పరిశోధకుడు డాక్టర్ టంగుటూరి సైదులును ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో సృజన సాహితీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, పరిశోధకుడు రామకృష్ణ పాల్గొన్నారు.



చందుపట్లలోని రాణి రుద్రమదేవి మరణశాసనాన్ని పరిశీలిస్తున్న పరిశోధకుడు మండల స్వామి



మిట్టపల్లి వెంకటేశ్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యకర్తలు

## యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మిట్టపల్లి వెంకటేశ

మిర్యాలగూడటౌన్, మే6: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన మిట్టపల్లి వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ అభివృద్ధికోసం కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడప గడపకూ చేరవేస్తానన్నారు. మిట్టపల్లి వెంకటేశ్ నియామకంపై పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనను పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

రామగిరి, మే 6: కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజల మధ్య అవాంతరాలు సృష్టిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలోని కోటిరెడ్డి ఫంక్షన్‌హాల్లో జరిగిన పార్టీ పట్టణ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్న బీజేపీ దేశానికే ప్రమాదకరంగా మారిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో మహిళలకు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎండీ సలీం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాశం, ఊట్కూరి నారాయణరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలోనే ప్రజా సంక్షేమం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచారం

నార్కట్‌పల్లి మే 6 : గత బీఆర్ఎస్ పాలనలోనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని చెర్వుగట్టు, ఏపీ లింగోటం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు బాగుపడతాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు మేకల రాజిరెడ్డి, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మల్గ బాలకృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.



చెర్వుగట్టులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

### క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి : వెంకన్నగౌడ్

శాలిగౌరారం, మే 6 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలించాలని పార్టీ మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్ కోరారు. సోమవారం మండలంలోని అడ్లూర్, మాదారం కలాన్, పెర్కకొండారం గ్రామాల్లో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కట్టా వెంకట్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అడ్లూర్‌లో ఉపాధిహామీ కూలీలను కలిసి మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి, మామిడి సర్వయ్య, తాళ్లూరి మురళి, జెర్రిపోతుల చంద్రమౌళిగౌడ్, బోడ నర్సయ్య, దొనకొండ అంజయ్య, మామిడి రమేశ్, సైదులు, తీగల వెంకన్న, బొడ్డు విజయ్ పాల్గొన్నారు.

### మర్రిగూడలో ప్రచారం

మర్రిగూడ : క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం మండలకేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మునగాల నారాయణరావు, పానుగోటి విజయరామారావు, మాజీ ఎంపీపీలు మెండు మోహన్‌రెడ్డి, అనంత రాజుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్, సీనియర్ నాయకులు బచ్చు రామకృష్ణ, సహకార చైర్మన్ పందుల యాదయ్య గౌడ్, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య, ఇన్‌చార్జి వెంకటనారాయణ గౌడ్, మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్, గ్రామశాఖ అధ్యక్షుడు రాపోలు యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

చిట్యాల : క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం చిట్యాల పట్టణంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక కనకదుర్గ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వ్యాపార సముదాయాలు, ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, మార్కెట్ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, నాయకులు పోలేపల్లి సత్యనారాయణ, బొలుగూరి సైదులు, ఆగు అశోక్, ఆవుల ఆనంద్, అంజి, దగ్గుల సైదులు, జిట్ట శేఖర్ పాల్గొన్నారు.

### హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మునుగోడు, మే6 : ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పగిళ్ల సతీశ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని గూడపూర్ గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఐతగోని లాల్‌బహుదూర్‌గౌడ్, ఈద శరత్‌బాబు. పాలగోని సైదులు గౌడ్, ఎడవల్లి సురేశ్, వట్టికోటి నర్సింహ, పందుల రాజేశ్, ఇరిగి విజయ్, జీడిమెట్ల పరమేశ్, రేవల్లి సాయలు, దొమ్మాటి నరేశ్, రేవల్లి సైదులు, శ్రీను, నర్సింహ, దోటి కరుణాకర్, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

### కంచర్లను భారీ మెజార్టీతో గెలిపించాలి : నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ, మే 6: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నియోజకవర్గ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ కోరారు. సోమవారం పట్టణంలోని సీతారాపురం 44, 48 వార్డుల్లో, ఎన్ఎస్పీ క్యాంపులోని 41వ వార్డులో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారి, వార్డు కోఆర్డినేటర్ యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బాసాని గిరితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నాయకులు జంజిరాల నాగరాజు, బంటు దుర్గయ్య, నేరెళ్ల శివ, అరుణ్, రవినాయక్ పాల్గొన్నారు.

### వేములపల్లిలో..

వేములపల్లి : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పద్మాశేఖర్‌రెడ్డి, పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి దైద జాన్సన్, నాయకులు జడ మట్టయ్య, మాలి శంకర్‌రెడ్డి, పాల్వాయి శ్రీను, నకిరేకంటి కిశోర్, వినోద్, మాతంగి సుధీర్, విజయ్, పుట్టల సైదులు, కల్లు శ్రీను, నరసింహ, లక్ష్మయ్య, లతీఫ్ పాల్గొన్నారు.



శాలిగౌరారం : అడ్లూర్‌లో ఉపాధిహామీ కూలీలతో కలిసి పని చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మర్రిగూడ : క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చిట్యాలలో చిరు వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మునుగోడు : ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



వేములపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న నల్లమోతు సిద్ధార్థ

## రాకేశ్‌రెడ్డి నామినేషన్‌కు తరలిరావాలి : గోపాల్‌రెడ్డి

గుర్రంపోడ్, మే 6: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి మంగళవారం నామినేషన్ వేయనున్నారని, కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు, పట్టభద్రులు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌కు అందరూ చేరుకోవాలని సూచించారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

గుర్రంపోడు, మే 6: మండలంలోని మొసంగి గ్రామానికి చెందిన నడ్డి శ్రీను (40) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ బి. శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నడ్డి శ్రీనును అదే గ్రామానికి చెందిన శీలం సైదాబాబు, చల్లా శంకర్ మిరపకాయలపై పట్టాలు కప్పేందుకు సాయంగా ఆదివారం సాయంత్రం తీసుకెళ్లారు. సైదాబాబు, శంకర్ రాత్రి ఇంటికి తిరిగి వచ్చి పడుకున్నారు. సోమవారం ఉదయం నడ్డి శ్రీను మృతి చెంది ఆంజనేయస్వామి గుడి ముందు పడిపోయి ఉండడాన్ని అదే గ్రామానికి చెందిన సైదయ్య గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే తన భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ నడ్డి రమణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పిడుగుపాటు వల్ల తాము స్పృహ కోల్పోయామని, రాత్రి స్పృహలోకి వచ్చిన తర్వాత ఇంటికి చేరుకున్నామని సైదాబాబు, శంకర్ చెబుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## మాజీ ప్రజాప్రతినిధులకు పింఛన్ అందించాలి : మేడి శంకర్

కట్టంగూర్, మే 6 : కాంగ్రెస్ మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా మాజీ ప్రజాప్రతినిధులకు పింఛన్లు అందించాలని మాజీ ప్రజాప్రతినిధుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్, ఉపాధ్యక్షుడు బీరెల్లి రామచంద్రయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కట్టంగూర్‌లో జరిగిన మాజీ ప్రజాప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ప్రజాప్రతినిధుల సమస్యలను ఇటీవల సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు గడుసు శంకర్‌రెడ్డి, దోమల శ్రీశైలం, గట్టిగొర్ల సత్తయ్య పాల్గొన్నారు.

## కృష్ణారెడ్డి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్‌రెడ్డి


దేవరకొండరూరల్, మే 6: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించుకునేందుకు పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమాశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకొని, వ్యవసాయాన్ని పండుగలా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే అన్నారు. పార్లమెంటులో తెలంగాణ గళాన్ని వినిపించేందుకు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట పార్టీ జిల్లా నాయకులు మునికుంట్ల వెంకట్ రెడ్డి, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు బొడ్డుపల్లి కృష్ణ ఉన్నారు.

## ఈవీఎంల కమిషనింగ్ పూర్తి

మిర్యాలగూడ, మే 6: మిర్యాలగూడ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల ఈవీఎం, వీవీప్యాట్ల కమిషనింగ్ ప్రక్రియ సోమవారం పూర్తయినట్లు ఆర్డీఓ శ్రీనివాస్ రావు తెలిపారు. ఆయా రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎం, వీవీప్యాట్లను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి సీల్ వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తాసీల్దార్లు హరిబాబు, శ్రీనివాస్‌శర్మ, జవహర్‌లాల్, సురేశ్, డీఐ బాలాజీనాయక్, ఆర్ఐలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీలో గ్రాండ్‌హెల్త్ చాలెంజ్

మిర్యాలగూడటౌన్, మే6: మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో సోమవారం నిర్వహించిన రెండోవిడుత గ్రాండ్‌హెల్త్ చాలెంజ్ కార్యక్రమాన్ని డిపో మేనేజర్ పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచనల మేరకు సీనియర్ డాక్టర్లతో ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం వరకు ప్రతిరోజు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు డిపోలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ భారతీబాయి, ఎంఎఫ్ యాదగిరి, డాక్టర్ల బృందం పాల్గొన్నారు.




హెల్త్‌క్యాంప్‌లో పాల్గొన్న అధికారులు, వైద్యులు

## గాలివానతో పండ్ల తోటలకు నష్టం

మర్రిగూడ, మే 6 : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన గాలివానకు మామిడి, నిమ్మ తోటలకు నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయి. సోమవారం రెవెన్యూ, హార్టికల్చర్, విద్యుత్ అధికారులు గ్రామాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. మండలంలోని తిరుగండ్లపల్లి, వట్టిపల్లి, భట్లపల్లి, మర్రిగూడ, దామెరభీమనపల్లి గ్రామాల్లో సుమారు 70 ఎకరాల్లో మామిడి, నిమ్మతోటలకు నష్టం వాటిల్లినట్లు హార్టికల్చర్ డివిజన్ అధికారి శ్వేత తెలిపారు. కొండూరుతండాలో రెండు, తిరుగండ్లపల్లిలో ఐదు ఇండ్లు కూలిపోయినట్లు తాసీల్దార్ శ్రీనివాస్ వెల్లడించారు. 60 విద్యుత్ స్తంభాలు విరిగిపోయినట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజేశ్ తెలిపారు. గృహ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.



తిరుగండ్లపల్లిలో విరిగిన మామిడి చెట్టు



నార్కట్‌పల్లిలో ఇంటిపై దెబ్బతిన్న ఇంటి పైకప్పు

### జానారెడ్డి కాలనీలో కూలిన ఇల్లు

తిరుమలగిరి(సాగర్) : ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని జానారెడ్డి కాలనీలో ఉన్న జటావత్ నాగేశ్వర్ రావు రేకుల ఇల్లు కూలిపోయింది. ఇల్లు కూలడంతో తాము ఆశ్రయం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

## విద్యాశాఖ కమిషనర్‌పై చర్య తీసుకోవాలి

- టీఎస్ యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి చావ రవి

రామగిరి, మే 6 : రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల సంక్షోభానికి కారణమైన టెట్ వివాద పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సెప్టెంబర్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన పదోన్నతులు కొనసాగింపునకు ఆటంకంగా ఉన్న టెట్ విషయంలో ఎన్‌సీటీఈ వివరణ తీసుకోవాలని సంఘం ఆధ్వర్యంలో అనేక మార్లు విన్నవించామని, చివరకు ఫిబ్రవరిలో క్లారిఫికేషన్ కోసం విద్యాశాఖ లేఖ రాసిందన్నారు. ప్రధానోపాధ్యాయులకు, పనిచేస్తున్న పాఠశాలల స్థాయిలో మార్పు లేనప్పుడు పదోన్నతులకు టెట్ అవసరం లేదని పేర్కొంటూ ఏప్రిల్ 8న ఎన్‌సీటీఈ నుంచి వివరణ వచ్చినప్పటికీ దానిని వెల్లడించలేదన్నారు. దాంతో ఉపాధ్యాయులందరినీ మానసిక ఆందోళనకు గురి చేయడంతో పాటు టెట్‌కు దరఖాస్తు చేయించటం ద్వారా లక్షల రూపాయలు వృథా చేయించారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసేలోగా ఎన్‌సీటీఈ నుంచి మరిన్ని అంశాలపై వివరణ తీసుకుని ఎన్నికల అనంతరం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నలపరాజు వెంకన్న, మురళయ్య, సోషల్ మీడియా కన్వీనర్ నాగుల సైదులు, జిల్లా నాయకులు రాజశేఖర్, మండల బాధ్యులు రమణ, ప్రభాకర్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న చావ రవి

## విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

త్రిపురారం, మే 6 : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండల కేంద్రంతోపాటు నీలాయగూడెం, కామారెడ్డిగూడెం, బాబుసాయిపేట గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలి విద్యుత్ సరఫరాకు అందరాయం ఏర్పడింది. సోమవారం ఉదయమే విద్యుత్ సిబ్బంది కొత్తగా స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇంకా ఎక్కడైనా విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు ఉన్నా, విద్యుత్ లైన్లు సరిగా లేకపోయినా అధికారులకు తెలుపాలని ఆయన సూచించారు.

## చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ

చందంపేట(దేవరకొండ), మే 6 : దేవరకొండ పట్టణంలోని సంజీవని ఆస్పత్రి యజమాని డాక్టర్ కృష్ణ సోమవారం పట్టణంలోని పలువురు చిరు వ్యాపారులకు గొడుగులు, వాటర్ బాటిళ్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ జానుయాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



చిరు వ్యాపారికి గొడుగు అందిస్తున్న దాతలు

## ఏసీలు, రిఫ్రిజిరేటర్ల పట్టివేత

నార్కట్‌పల్లి, మే6 : పోలీసులు సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా డీసీఎం వాహనంలో హైదరాబాద్ నుంచి నల్లగొండకు తరలిస్తున్న 103 ఏసీలు, రిఫ్రిజిరేటర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. వాటి విలువ రూ.23,25,430 ఉంటుందని పేర్కొన్నారు. దాంతో పాటు పలువురు ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.20 లక్షలను పట్టుకున్నట్లు తెలిపారు.